చెన్నారావుపేట: ఏఐ కంప్యూటర్ బోధనను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

# ఏఐ ద్వారా పాఠాలు బోధించాలి

### కంప్యూటర్ తరగతులు ప్రారంభించిన కలెక్టర్ సత్యశారద

చెన్నారావుపేట, మార్చి 15: విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాఠ్యాంశాలు బోధించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. మండలంలోని జల్లి, లింగాపురం, పాపయ్యపేట ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఆమె ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ బోధనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు ఏఐ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులు త్వరలో జరగబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే, పాఠశాలలో వంట గదులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వంట చేసే ముందు పాత్రలను శుభ్రంగా కడగాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, బాలింతలకు నాణ్యమైన సరుకులు అందించాలన్నారు. గడువు తీరిన పాల ప్యాకెట్లు లబ్ధిదారులకు ఇవ్వొద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్, ఏఎంవో జిల్లా అధికారి సృజన్‌తేజ, మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఎంఈవో బైరి సరళ, జిల్లా రిసోర్స్‌పర్సన్ రాయపురెడ్డి, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏఎస్సై లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

### అభ్యసనా సామర్థ్యాల పెంపునకు..

నర్సంపేట/రాయపర్తి/గీసుగొండ: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంచడానికి ఏఐ టెక్నాలజీ చాలా అవసరమని ఎంఈవో కొర్ర సారయ్య అన్నారు. మండలంలోని మహేశ్వరం జడ్పీహెచ్ఎస్‌లో 3, 4, 5వ తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం ఏఐ, ఏఎక్స్ఎల్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అలాగే, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనను రాయపర్తి ఇన్‌చార్జి ఎంఈవో మామునూరి శ్రీధర్ మండలంలోని ఊకల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించారు. గీసుగొండ, మండలంలోని మచ్చాపురం ప్రాథమిక పాఠశాలలో ఏఐ టెక్నాలజీతో విద్యాబోధనను స్టేట్ రిసోర్స్‌పర్సన్ రాయపురెడ్డి ప్రారంభించారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

ఖిలావరంగల్, మార్చి 15: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నమాల డిమాండ్ చేశారు. ఖిలావరంగల్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జెండా ఆవిష్కరించారు. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ, మహిళలకు రూ. 2500 అందించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట ఎండీ జరినా, టీ భవాని, స్వరూప, రాజేశ్వరి, రాధిక, పరమేశ్వరి, సరోజన ఉన్నారు.

# సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

ట్రై సైకిల్‌ను అందజేస్తున్న డీఆర్వో విజయలక్ష్మి

గిర్మాజీపేట, మార్చి 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సీడబ్ల్యూఎస్ఎన్ (ప్రత్యేక అవసరాలు గల పిల్లలు) పిల్లలు వినియోగించుకోవాలని డీఆర్వో విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ కుడికాల సుభాష్ సమక్షంలో జిల్లాలోని అర్హత కలిగిన సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ 'అలీంకో' సౌజన్యంతో వివిధ రకాలైన వీల్‌చైర్, ట్రై సైకిల్, రోలేటర్, బీటీఈ, క్రచెస్, సీపీ చైర్ మొత్తం 63 రకాల ఉపకరణాలను అందించారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ ఎంఈవో ప్రసాద్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు శారదాబాయి, ప్రకాశ్‌గౌడ్, ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్ట్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

PLOT FOR SALE

★ జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.
NT-330714

శ్రీ లక్ష్మీప్రసన్న రియల్ ఎస్టేట్స్

★రామన్నపేట: G+2, 3 బెడ్‌రూమ్స్, 2 సింగిల్ పోర్షన్స్, 2 సింగిల్ బెడ్ రూమ్స్, 204 గజాలు, 80 లక్షలు, G+1, 30 Lakhs, G+2, 2, 20, Co, G+1, 1.50 C 204, 65 Lakhs, 73.18 Lakhs, G+1, 84.45 Lakhs. Cell: 8096104080, 9292104080
NTW-000

WANTED

★Wanted Female Marketing Executives for a Reputed Pvt. Ltd Company. Salary : 12,000/- to 20,000/-, Quli: Inter/Degree, Age: 24 to 30. Cont: 7660009009, 7036229903
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

గీసుగొండ: స్వామి వారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

గీసుగొండ: జాతరకు తరలివస్తున్న రాజకీయ ప్రభలు

# జనసంద్రం.. కొమ్మాల జాతర

- రెండో రోజు భారీగా తరలివచ్చిన భక్తులు
- సందడి చేసిన రాజకీయ ప్రభలు
- ట్రాఫిక్ జామ్.. భక్తుల ఇబ్బందులు

గీసుగొండ, మార్చి 15: కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర శనివారం జనసంద్రంగా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వరకు లక్ష మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకుడు రామాచార్యులు తెలిపారు. భక్తులు గంటల తరలబడి క్యూలైన్‌లో వేచిఉండి దర్శనం చేసుకుంటున్నారు. నర్సంపేట నియోకజవర్గంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంసీపీఐ(యూ) రాజకీయ ప్రభలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. డీజేల ఎదుట నృత్యాలు చేస్తూ జాతరకు తరలివచ్చారు. ప్రభలను చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. జాతరలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శౌర్యశరణ్య తెలిపారు. 500 మంది పోలీసులు బందోబస్తులో ఉన్నా భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. జాతరలో మరుగుదొడ్లకు తాళం వేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెన్నారావుపేట: బీఆర్ఎస్ ప్రభ బండిని ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు

### జాతరకు తరలిన ప్రభ బండ్లు

నర్సంపేట/చెన్నారావుపేట: కొమ్మాల జాతరకు బీఆర్ఎస్ నర్సంపేట మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు ప్రభబండ్లను తరలించారు. జై తెలంగాణ.. జైజై తెలంగాణ అంటూ నినదిస్తూ ర్యాలీగా తరలివెళ్లారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచన మేరకు చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేట, ఈర్యతండా, లింగాపురం గ్రామాల నుంచి బీఆర్ఎస్ ప్రభ బండ్లను నాయకులు బాల్నె వెంకన్న, జక్క అశోక్, అనుముల కుమారస్వామి, కంది కృష్ణచైతన్యరెడ్డి, పసునూటి రమేశ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు జాతరకు తరలించారు.

నర్సంపేట: జీజీఆర్‌పల్లి ప్రభబండిని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నామాల సత్యనారాయణ

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒకరి మృతి

ఆత్మకూరు/వర్ధన్నపేట, మార్చి 15: కటాక్షపురం శివారులో శుక్రవారం రాత్రి డివైడర్‌ను ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగశివ(27) ములుగు జిల్లాకు చెందిన సిద్దు రాజు వద్ద ఇసుక లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం తన స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మార్గ మధ్యంలో కటాక్షపురం శివారులో ఎదురుగా వస్తున్న భారీ వాహనం లైట్ ఫోకస్‌తో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. బలమైన గాయాలైన అతడిని పోలీసులు అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడి స్వగ్రామం కొత్తపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. నాగశివ స్నేహితులతో పాటు గ్రామానికి చెందిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, ఇతర గ్రామ ప్రముఖులు పరామర్శించారు.

### కొమ్మాల జాతరలో బావిలో పడి ఒకరి మృతి

గీసుగొండ, మార్చి 15: జాతరకు వచ్చిన ఒకరు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరలో జరిగింది. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. సంగెం మండలం పల్లారుగూడ శివారులోని వీఆర్ఎస్ తండాకు చెందిన వాసం అరుణ్‌కుమార్(31), అతడి స్నేహితుడు గుగులోత్ రాజు శుక్రవారం రాత్రి కొమ్మాల జాతరకు వచ్చారు. ఆర్చి నుంచి ప్రభ బండ్లను చూస్తూ వెళ్తున్న క్రమంలో భక్తుల రద్దీతో ఇద్దరు విడిపోయారు. రాజు శనివారం ఇంటికి రాగా, అరుణ్‌కుమార్ ఇంటికి చేరుకోలేదు. ఈ విషయమై అతడి భార్య శ్రావణి రాజును వివరాలు అడిగింది. జాతరలో విడిపోయామని చెప్పడంతో కుటుంబ సభ్యులు జాతరకు వచ్చి వెతికారు. ఈ క్రమంలో బావిలో శవమై కనిపించాడు. వెంటనే అరుణ్‌కుమార్ మృతదేహాన్ని తీశారు. శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

నెక్కొండ, మార్చి 15: తనకు వివాహం కావడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. నెక్కొండకు చెందిన సదునాల అరుణ్(27) గతంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. కానీ, అతడి ప్రేమను యువతి తిరస్కరించింది. అప్పటి నుంచి పెళ్లి సంబంధాలు చూస్తుండగా కుదరడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఈ నెల 3న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అరుణ్ అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

### ట్విట్టర్ అకౌంట్ హ్యాండ్లర్‌పై కేసు నమోదు

కరీమాబాద్, మార్చి 15: ఇటీవల నగరంలో బాలిక కిడ్నాప్ ఉదంతానికి సంబంధించిన సమాచారాన్ని గుర్తుతెలియని మహిళ, బాలిక ఫొటోను తన ట్విట్టర్‌లో తెలుగు స్క్రైబ్ ట్విట్టర్ అకౌంట్ హ్యాండ్లర్ పోస్టు చేశాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రేపు నేత్ర వైద్య శిబిరం

నెక్కొండ, మార్చి 15: ప్రగతి సేవా సమితి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రగతి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. నెక్కొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### ఘనంగా కాన్షీరాం జయంతి

నర్సంపేట/వర్ధన్నపేట, మార్చి 15: బహుజన రాజ్యాధికార శిల్పి కాన్షీరాం జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేటలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు పూలమాలలు వేశారు. అలాగే, వర్ధన్నపేటలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో కాన్షీరాం జయంతిని ప్రజాసంఘాల నాయకులు నిర్వహించారు. మాదిగల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నర్సయ్య, జాతీయ అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ కాన్షీరాంకు నివాళులర్పించారు.

### మహాసభను విజయవంతం చేయాలి

పోచమ్మమైదాన్, మార్చి 15: అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏకేఐఎంఎస్) 3వ మహాసభలో భాగంగా ఈ నెల 21న బహిరంగ సభ, 22, 23న మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు పోచమ్మమైదాన్‌లో శనివారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఆరెల్లి కృష్ణ, ఆబర్ల రాజన్న, రంజిత్, ఆదిత్య ఠాగూర్, పద్మక్క, మధుసూదన్, రాజేందర్ పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి

### కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, మార్చి 15: వినియోగదారుల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో శనివారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్యపరమైన జీవితం సాగించడానికి ప్రతి రోజు చేయాల్సిన వ్యాయామం ప్రాధాన్యాన్ని వినియోగదారులకు తెలియజేయాలన్నారు. సమీక్షలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా జాతీయ కమిషన్ సభ్యులు నరసింహారావు, జిల్లా పుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎంవీఐ శోభన్ బాబు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గౌతమ్‌రెడ్డి, డీఎంవో అనురాధ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీస్, పెట్రోల్ బంక్ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

మాటాడుతున్న కలెక్టర్ సత్యశారద

### ఈవీఎం గోదాముల తనిఖీ

కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంను కలెక్టర్ సత్యశారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ రికార్డులు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు తెలుసుకున్నారు. ఆమె వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, నాయకులు బాకం హరిశంకర్, శ్యామ్ సుందర్, ఫైజోద్దీన్ ఉన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

మాట్లాడుతున్న సత్యవాణి

వరంగల్‌చౌరస్తా, మార్చి 15: ప్రతి విద్యార్థి తమ జీవిత నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని యువజన, క్రీడల అధికారి సత్యవాణి సూచించారు. కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఇన్‌చార్జి హెచ్ఎం సందీప్‌కుమార్ అధ్యక్షతన స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను తామంతట తాముగా పరిష్కరించుకోగలిగే సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మండల పరశురాములు, ఉపాధ్యాయులు మస్సా వెంకటేశ్వర్లు, జోగయ్య, రాజేశ్, చింతం నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

### 'యువత ప్రపంచాన్ని శాసించాలి'

గిర్మాజీపేట/ఖానాపురం: ప్రపంచాన్ని శాసించే స్థాయికి దేశ యువత ఎదగాలని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి ఉంటే భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాలు చేరుకుంటారని రిటైర్డ్ హెచ్ఎం గోరంట్ల శ్రీమన్నారాయణ అన్నారు. ఎంఈవో గంప అశోక్‌కుమార్ సమక్షంలో శనివారం వివిధ శాఖల అధికారులు మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలతోపాటు పలు పాఠశాలల 9, 10వ తరగతుల విద్యార్థులకు 'స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించారు. అలాగే, ఖానాపురంలో మండలంలోని అశోక్‌నగర్ కేజీబీవీ, బుధరావుపేట మోడల్‌స్కూల్‌లో స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీడీవో సౌజన్య మాట్లాడుతూ బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, మహిళలు రాణిస్తే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ మేనక, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో మౌలిక వసతులు కల్పించాలి

సురేంద్రమోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీందర్‌రెడ్డి

కాశీబుగ్గ, మార్చి 15: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ సురేంద్రమోహన్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం డైరెక్టర్ లక్ష్మీబాయి, అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జేడీఎం ఉప్పుల శ్రీనివాస్, డీఎంవో కలకోట్ల సురేఖతోపాటు చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్ సమస్యలపై చర్చించారు. రైతులు సరుకులు నిల్వ చేసే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, వీధీలైట్లు పని చేయకపోవడం వల్ల బస్తాలు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. యార్డులను శుభ్రం చేయకపోవడం వల్ల మిర్చి ఘాటుతోపాటు దుమ్ము ధూళితో రైతులు, వ్యాపారులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కోల్డ్ స్టోరేజీలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వారి వెంట చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కోశాధికారి అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు కైలాస్ హరినాథ్, వెల్ది చక్రధర్, లింగారెడ్డి, నాగభూషణం, సదానందం ఉన్నారు.

# పశువులకు మేతగా పట్టణ ప్రకృతి వనం

నర్సంపేట, మార్చి 15: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులను ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ గాలికొదిలేసింది. దీంతో పల్లె, పట్టణ ప్రకృతి వనాలు కలతప్పాయి. నర్సంపేటలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం నేడు పశువులకు మేతగా మారింది. గత ప్రభుత్వం వరంగల్ రోడ్డులోని స్వామి వివేకానంద కాలనీలో లక్షలాది రూపాయల నిధులతో పార్కులో వేలాది మొక్కలు నాటి సంరక్షించింది. దీంతో పార్కు పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఆలనా పాలన గాలికొదిలేయడంతో ప్రకృతి వనంలోని మొక్కలు ఎండిపోయాయి. మిగిన మొక్కలను పశువులు మేస్తున్నాయి.

పట్టణంలోని పార్కులో చెట్లను మేస్తున్న బర్రెలు

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ యువ నేత

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి, మార్చి 15: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినందున రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు ముస్కు రాజేందర్ శనివారం పెద్ది సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గొర్రె శ్రీనివాస్, చల్ల గోపాల్‌రెడ్డి, యారమెహన్‌రెడ్డి, చల్లా సంజీవరెడ్డి, నరిగె ఐలయ్య, బుడుగొండ చంద్రయ్య, రఘు, అనుముల రాజు, సంపత్ పాల్గొన్నారు.

## 'నేతన్నల హామీలు అమలు చేయాలి'

పోచమ్మమైదాన్, మార్చి 15: గత ఎన్నికల సందర్భంగా నేతన్నలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సందర్భంగా చేనేత రంగ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాసన సభలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జౌళిశాఖతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా చేనేతకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని, కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టళ్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన వస్త్రాలు, పొదుపు సంఘాల మహిళల చీరెల ఉత్పత్తిని చేనేతకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి కనీసం నెలకు రూ. 18 వేల వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేతన్న పొదుపు పథకం(త్రిప్టు) నుంచి కార్మికుల సంఖ్య కుదించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు

## ఆరో రోజుకు చేరిన రిలే దీక్షలు

వరంగల్, మార్చి 15: ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలను ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇసంపల్లి రాజు ప్రారంభించారు. నాయకులు గంగారపు మల్లన్న, కల్లపల్లి రమేశ్, బిర్రు కొమురయ్య, రేణికుంట్ల నెల్సన్, మంద శ్రావణ్, కోట యాదగిరి, పోలెపాక యాదగిరి ప్రసాద్, మంద కుమారస్వామి పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

## కనుల పండువగా స్వామివార్ల కల్యాణం

రాయపర్తి, మార్చి 15: బంధన్‌పల్లిలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి, మండలంలోని రుక్మిణీ సత్యభామ సమేత చెన్నకేశవస్వామి వార్ల కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ కనులపండువగా జరిగాయి. ఆయా గ్రామాల్లో ఆలయ అభివృద్